తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక





హైదరాబాద్ బుధవారం 03 - 06 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 1


## మోటార్లకు మీటర్లు పెట్టి

# రైతులకు ఉరి వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి



- వ్యవసాయానికి ఉచిత కరెంట్ బంద్ చేసే కుట్ర
- మోడీ, చంద్రబాబు డైరెక్షన్‌లో పని చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజావారధి/మోత్కూరు

వ్యవసాయ మోటార్లకు కాంగ్రెస్ ప్రభుత్వం మీటర్లు పెట్టి తెలంగాణ రైతాంగానికి ఉరి వేయాలని చూస్తుందని మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లు కేసీఆర్ తెలంగాణ రైతాంగానికి కంటి రెప్పలా కాపాడుకున్నా రన్నారు. ప్రాజెక్టులు కట్టి రైతులకు సాగునీరు ఇచ్చి, ఉచిత కరెంట్, రైతుబంధు ఇచ్చి, సకాలంలో ఎరువులు అందించి రైతులకు ఏ కష్టం లేకుండా చూసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులను కన్నీటి పాలు చేస్తుందని, ఎరువులు అందక రైతులను రోడ్ల పాలు చేసిందని, ఇప్పుడు పంట కొనక రైతులను అరిగోస పెడుతుందన్నారు. రైతు భరోసా కూడా ఎగ్గొట్టిందన్నారు. మోడీ, చంద్రబాబు డైరెక్షన్‌లో నడుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ఉచిత కరెంట్ బంద్ చేసే కుట్రకు తెర లేపారని, అందులో భాగంగానే మోటార్లకు మీటర్లు పెట్టేందుకు రెడీ అవుతున్నారని తెలిపారు. రెండు నెలలుగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం పోసి ప్రభుత్వం కొనకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు లేవని, రైతులు పడుతున్న బాధలు చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ రైతాంగం పట్ల ఏపాటి చిత్తశుద్ధి, ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. తెలంగాణ రైతాంగాన్ని కష్టాల పాలు చేయాలని చూస్తే ఊరుకోమని, మోటార్లకు మీటర్లు పెడితే కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో మరో ఉద్యమానికి పూనుకుంటామని హెచ్చరించారు. దొంగకు తాళం ఇస్తే దోచుకున్నట్టే.. తెలంగాణను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దోపిడీ చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జంగ శ్రీను, గజ్జి మల్లేష్, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు కొండా సోంమల్లు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు దాసరి తిరుమలేష్, మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రాంపాక నాగయ్య, మోత్కూరు మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ సుల్తాన్ స్వామి, బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి గిరగాని శ్రీను, నాయకులు మలిపెద్ది మల్లారెడ్డి, కంచర్ల క్రాంతికుమార్ రెడ్డి, కూరెళ్ల రమేష్, జిట్ట సాయికుమార్, కె.శోభన్ బాబు, వర్రె రాములు, పొన్నెబోయిన మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.